సాక్షి
రంగారెడ్డి

ఆదివారం । 28 । జూలై । 2024



**సీఎం పర్యటనను..**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. 10లో ▸



**సాంకేతిక పరిజ్ఞానంతో..**

ఈ-ఆఫీసు ద్వారా ప్రజలకు సేవలందిస్తేనే పారదర్శకంగా ఉంటుందని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత అన్నారు. 10లో ▸



**ఎన్‌సీసీ క్యాడెట్లకు..**

విద్యార్థులు ఎన్‌సీసీ విభాగంలో పోటీతత్వం ప్రదర్శించడం అభినందనీయమని డాక్టర్ జి.విజయ్ అన్నారు. 10లో ▸

## న్యూస్‌రీల్

### వినియోగదారుల హక్కుల కమిషన్ అధ్యక్షుడిగా శంకర్

**ఇబ్రహీంపట్నం రూరల్:** వినియోగదారుల హక్కుల కమిషన్ జిల్లా అధ్యక్షుడిగా యాద శంకర్ నియమితులయ్యారు. శనివారం ఈ మేరకు ఎన్‌సీఆర్‌సీ ఫౌండర్ జాతీయ చైర్మన్ డాక్టర్ ఎంవీఎల్ నాగేశ్వర్‌రావు, తెలంగాణ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. కొంతమంది స్వార్థపరులు స్వలాభం కోసం ప్రతీ వస్తువును కల్తీ చేస్తున్నారన్నారు. ప్రజల హక్కులను కాపాడడం కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు.

### రాష్ట్ర స్థాయి‘సైన్స్ ఇన్‌స్పైర్’కు చేవెళ్ల విద్యార్థి

**జిల్లా మొదటి స్థానంలో నిలిచిన సర్బజిత్**



సర్బజిత్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

**చేవెళ్ల:** జపాన్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి సైన్స్ ఫెస్టివల్ కోసం ఏర్పాటు చేసిన సైన్స్ ఇన్‌స్పైర్ పరీక్షల్లో చేవెళ్ల ఆదర్శ కళాశాల విద్యార్థి సత్తా చాటాడు. జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పరీక్షకు అర్హత సాధించాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ టేనావతి మాట్లాడుతూ.. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సైన్స్ ఇన్‌స్పైర్ పరీక్షల్లో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచి ఈ నెల 30న నిర్వహించే పరీక్షకు అర్హత సాధించాడని చెప్పారు. ఈ రాత పరీక్ష అనంతరం నిర్వహించే ఇంటర్వ్యూలో అర్హత సాధిస్తే నవంబర్ 16న జపాన్‌లో నిర్వహించే సైన్స్ ఫెస్టివల్‌కు అవకాశం లభిస్తుందన్నారు. ఈ సైన్స్ ఫెస్టివల్‌కు రాష్ట్రం నుంచి నలుగురు విద్యార్థులకు అవకాశం ఉంటుందన్నారు. తమ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థి సర్బజిత్ జిల్లాలో మొదటిస్థానంలో రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సర్బరాజ్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. రాష్ట్రస్థాయిలోనూ రాణించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

### జర్నలిస్ట్‌పై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి

**బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి**



జర్నలిస్టు గణేశ్‌ను పరామర్శిస్తున్న బీజేపీ నాయకులు

**మొయినాబాద్:** జర్నలిస్ట్ గణేశ్‌పై దాడికి పాల్పడిన వారిని పోలీసులు వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన మండల పరిధిలోని ముర్తూజగూడలో గణేష్‌ను పరామర్శించి ఆయనపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. గణేశ్ ఎదుగుదలను చూసి తట్టుకోలేని వారే దాడి చేశారని.. ఈ దాడిలో కొందరి స్థానికుల కుట్ర ఉండి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు సమగ్ర విచారణ చేపట్టి దాడి వెనుక సూత్రధారులను గుర్తించి అరెస్టు చేయాలన్నారు. పాలక ప్రభుత్వాల ఉదాసీనత వల్లే జర్నలిస్టులపై దాడులు పెరుగుతున్నాయన్నారు. గణేష్ కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాష్, పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మోర నర్సింహారెడ్డి తదితరులున్నారు.

# స్వచ్ఛతకు ప్రాధాన్యం

**పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు**

- ప్రజల సహకారంతో స్వచ్ఛ మున్సిపాలిటీగా మారుస్తాం
- ప్రతీ కాలనీలో ఫాగింగ్ చేయిస్తాం
- తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్
- ‘సాక్షి’ ఫోన్‌ఇన్‌కు స్పందన

దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం.. పారిశుద్ధ్య నిర్వహణ, సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకుంటామని తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ అన్నారు. ‘సాక్షి’ఆధ్వర్యంలో శనివారం తుక్కుగూడ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఫోన్‌ఇన్‌కు విశేష స్పందన లభించింది. ఆయా వార్డుల నుంచి వచ్చిన ఫిర్యాదులను నోట్ చేసుకున్నారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. ఫోన్‌ఇన్ నిర్వహిస్తుండగానే తుక్కుగూడ నుంచి బాసగూడకు వెళ్లే మార్గంలో చెత్త తీసివేయించారు. దీంతో స్థానికులు ‘సాక్షి’కి కృతజ్ఞతలు తెలిపారు.

– తుక్కుగూడ



పట్టణ వాసుల సమస్యలపై ఫోన్ ఇన్‌లో మాట్లాడుతున్న కమిషనర్, పక్కన మున్సిపల్ అధికారులు

సాక్షి
ఫోన్ ఇన్

ప్రశ్న: మిషన్ భగీరథ పనుల్లో భాగంగా 3వ వార్డులో రోడ్లు తవ్వి వదిలేశారు. రోడ్డు వేయక ఇబ్బంది పడుతున్నాం.

– కె.రంజిత్ కుమార్, 3వ వార్డు రావిర్యాల

కమిషనర్: నూతన రోడ్ల నిర్మాణానికి కౌన్సిల్ మీటింగ్‌లో బడ్జెట్ కేటాయించి పనులు పూర్తిచేస్తాం

ప్రశ్న: 11, 14వ వార్డుల్లో రోడ్లు పాడై నీరు నిలుస్తోంది. తుక్కుగూడ నుంచి సర్దార్‌నగర్ వరకు వీధి దీపాలు వెలగడం లేదు.

– గడ్డి రాజు, సర్దార్‌నగర్

కమిషనర్: రోడ్ల మరమ్మతులు చేపట్టి.. వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకుంటాం

ప్రశ్న: లక్ష్మీనగర్ కాలనీ బొడ్రాయి గల్లీలో ఖాళీ ప్రదేశంలో చెత్త వేస్తున్నారు. దీంతో దోమల బెడద తీవ్రమైంది.

– బరిగెల శ్రీకాంత్, లక్ష్మీనగర్

కమిషనర్: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటాం. కాలనీల్లోనూ ఫాగింగ్ చేయిస్తాం.

ప్రశ్న: గృహాలకు విద్యుత్ సరఫరా చేసే విద్యుత్ వైర్లు మా ఇంటి మీదుగా ఉన్నాయి. దీంతో ఆందోళనకు గురువుతున్నాం. ఇప్పటికే ఎన్నోసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదు.

– నక్క రాజు, 2వ వార్డు

కమిషనర్: లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: రావిర్యాల-ఆర్‌సీఐ రోడ్డులో ఓపెన్ జిమ్ వద్ద వాహనాలు వేగంగా రాకపోకలు సాగిస్తున్నాయి. స్పీడ్ బ్రేకర్ వేయించాలి.

– పాశం సుదర్శన్, 2వ వార్డు

కమిషనర్: రావిర్యాల-ఆర్‌సీఐ మార్గం ఆర్ అండ్ బీ శాఖ పరిధిలో ఉంది. వారితో మాట్లాడి చర్యలు తీసుకుంటాం

ప్రశ్న: మున్సిపల్ పరిధిలో తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయించాలి. ఇండ్ల నుంచి నీరు వృథాగా పారుతున్నాయి. డ్రైనేజీ నీరు తాగునీటితో కలవకుండా చర్యలు తీసుకోవాలి.

– గోనమోని శివశంకర్, రావిర్యాల

కమిషనర్: ప్రతీ 15 రోజులకు ఒకసారి ట్యాంకులను శుభ్రం చేస్తున్నాం. మురుగునీరు, తాగునీరు కలవకుండా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: మంఖాల్‌లో మిషన్ భగరథ, తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు సందర్భంగా గల్లీ రోడ్లు దెబ్బతిన్నాయి. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

– పోలమోని శ్రీలత, మంఖాల్

కమిషనర్: రోడ్ల మరమ్మతులు చేయించి ప్రజల ఇబ్బందులు తీరుస్తాం.

ప్రశ్న: 3వ వార్డులో మూడేళ్లుగా మూడు ఇండ్లకు నీటి సరఫరా అవ్వడం లేదు. అధికారులకు ఫిర్యాదు చేసినా పరిష్కరించలేదు.

– హరికృష్ణ, 3వ వార్డు, రావిర్యాల

కమిషనర్: స్వయంగా నేనే వచ్చి పరిశీలించి సమస్యను పరిష్కరిస్తా.

ప్రశ్న: తుక్కుగూడ-బాసగూడ తండా రోడ్డులో చెత్త వేస్తున్నారు. ప్రయాణికులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు.

– ముప్పిడి కేదార్‌నాథ్‌గౌడ్

కమిషనర్: చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటాం.



కుర్మిద్ద గ్రామంలో ఫార్మాకు సేకరించిన భూములను పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక, టీఎస్ఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి

# ఎంత భూమి సేకరించారు

- ఫార్మా భూముల్లో కలెక్టర్ పర్యటన
- టీఎస్ఐఐసీ సేకరించిన స్థలాలపై ఆరా
- విషయం తెలుసుకుని తరలివచ్చిన కుర్మిద్ద రైతులు
- బాధితులను అడ్డుకున్న పోలీసులు

**ఇబ్రహీంపట్నం రూరల్:** ఫార్మాసిటీ ఏర్పాటుకు కుర్మిద్ద గ్రామంలో టీఎస్ఐఐసీ సేకరించిన భూముల్లో శనివారం కలెక్టర్ శశాంక, టీఎస్ఐఐసీ అధికారులతో కలిసి ఆకస్మికంగా పర్యటించారు. టీఎస్ఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి భూములను పరిశీలించారు. ఇప్పటి వరకు టీఎస్ఐఐసీ అధికారులు ఎంత భూమి సేకరించారు.. ఇంకా ఎంత అవసరం ఉందని యాచారం తహసీల్దార్ అయ్యప్ప, కందుకూరు తహసీల్దార్ గోపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ పర్యటిస్తున్న విషయం కుర్మిద్ద భూ బాధితులకు తెలియడంతో వారు హుటాహుటిన కలెక్టర్ పర్యటిస్తున్న ప్రాంతానికి చేరుకున్నారు. కలెక్టర్ పర్యటనపై అభ్యంతరం వ్యక్తం చేశారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములను రైతుల పేరిట చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఫార్మా ఏర్పాటు చేస్తే ఊరుకోమంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్‌ను ప్రశ్నించేందుకు ప్రజలు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**త్వరలోనే ముఖ్యమంత్రి పర్యటన**

టీఎస్ఐఐసీ సేకరించిన భూముల్లో ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తారా.. మెగా టౌన్‌షిప్ ఏర్పాటు చేస్తారా అనే సందిగ్ధం ప్రజల్లో నెలకొంది. త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించనున్నట్లు తెలిసింది. మెగా టౌన్‌షిప్ నిర్మాణం కోసం పునాదిరాయి వేసేందుకు ఏర్పాట్లలో భాగంగానే కలెక్టర్ పర్యటించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం నిర్ణయంపై ప్రజలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

### స్కిల్ డెవలప్‌మెంట్ వర్సిటీ

**కందుకూరు:** మండల పరిధిలోని ముచ్చర్లలో ప్రభుత్వం సేకరించిన భూములను శనివారం కలెక్టర్ శశాంక క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం 50 ఎకరాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ఏర్పాటు చేయడానికి పరిశీలిస్తోంది. ఇందుకు ముచ్చర్లలోని సర్వే నంబర్ 288 భూమిని పరిశీలించారు. ఆగస్టు 1న సీఎం రేవంత్‌రెడ్డి ఈ ప్రాంతానికి రానున్నట్లు తెలిసింది. 50 ఎకరాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేయనున్నట్లు సమాచారం.



సమావేశంలో మాట్లాడుతున్న కాంతయ్య

# పెండింగ్ బిల్లులు చెల్లించండి

**వ్యవసాయ కార్మిక సంఘం బీకేఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు కాంతయ్య**

**చేవెళ్ల:** ప్రతీ వారం ఉపాధి హామీ కూలి డబ్బులు చెల్లిస్తామని ఎన్నికల ముందు హామీలిచ్చిన ప్రభుత్వం నెలలు గడుస్తున్నా పెండింగ్ బిల్లులు చెల్లించడం లేదని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బీకేఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు కె.కాంతయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం జిల్లా అధ్యక్షుడు అంజయ్య అధ్యక్షతన మండల కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బీకేఎంయూ జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు కాంతయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఉపాధిహామీ కూలీల డబ్బులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా వ్యవసాయ కార్మికుల బతుకులు మారడం లేదని ఆవేదన వెల్లిబుచ్చారు. చిత్తశుద్ధి లేని నాయకులను, ప్రభుత్వాలను ఎన్నుకోవడం వల్లే ప్రజలకు ఈ దుర్గతి ఏర్పడుతోందన్నారు. ప్రధాని మోదీకి ఉపాధి హామీ పథకంపై చిత్తశుద్ధి లేనందునే పథకాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఉపాధి చట్టాన్ని కాపాడుకునేందుకు మరో ఉద్యమానికి పేదలు, కార్మికులు సన్నద్ధమవ్వాలని సూచించారు. అనంతరం 23 మందితో నూతన కౌన్సిల్‌ను ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా జంగయ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా లక్ష్మయ్య, ఉపాధ్యక్షులుగా రమేశ్, ఎం.కృష్ణ, సహాయ కార్యదర్శిగా గాలయ్య, ఆనంద్, మరో 13 మంది కార్యవర్గ సభ్యులను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు కె.రామస్వామి, సత్యనారాయణ, ఎం.ప్రభులింగం, సుధాకర్‌గౌడ్, సత్తిరెడ్డి, జంగయ్య, వెంకటేశ్, నర్సింహ, స్వరూప, మంజుల, లలిత, స్వరూప, శివ, ఆనందం, నర్సింలు, కృష్ణయ్య, చంద్రయ్య, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

# పరమత సహనంతోనే దేశంలో ఐక్యత

- మతోన్మాదాన్ని ఉపేక్షించకూడదు
- రాజ్యాంగాన్ని ముక్కలు చేసేందుకు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌ల కుట్ర
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం




మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

**ఇబ్రహీంపట్నం:** మతం వ్యక్తిగత విషయమని, దీన్ని సమాజంపై రుద్దొద్దని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఇబ్రహీంపట్నంలోని వైష్ణవి గార్డెన్‌లో శనివారం మాజీ ఎమ్మెల్యే, దివంగత నేత మస్కు నర్సింహ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మతం- మతోన్మాదంపై నిర్వహించిన సదస్సుకు హాజరైన తమ్మినేని మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక మతోన్మాదం పెరిగిపోయిందన్నారు. మతం వేరు మతోన్మాదం వేరన్నారు. మతం వ్యక్తిగత విషయమని, దీన్ని వ్యతిరేకించడం లేదని తెలిపారు. దేశ విచ్ఛిన్నానికి కారణమయ్యే మతోన్మాదాన్ని ఉపేక్షించకూడదన్నారు. ప్రతిఒక్కరూ పరమత సహనంతో మెలిగినప్పుడే దేశంలో ఐక్యత నెలకొంటుందని వివరించారు. అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని ముక్కలు చేసేందుకు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కుట్ర పన్నుతున్నాయని ఆరోపించారు. క్రిస్టియన్లు, ముస్లింలు, నిమ్న జాతులపై దాడులు చేస్తూ మనోత్మానాదాన్ని రెచ్చ గొడుతున్నారని మండిపడ్డారు. దేశంలో 85 శాతం హిందువులుండగా.. మిగిలిన 15 శాతం ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, జైనులు ఉన్నారని తెలిపారు. వీరి మధ్య మత వైషమ్యాలను సృష్టించి రాజకీయ లబ్ధి పొందేందుకు చూస్తున్నారని ఆరోపించారు. దేశంలో హిందూ రాజ్యాన్ని స్థాపించి యథాతథంగా మనుధర్మశాస్త్రాన్ని అమలు చేసేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ చేస్తున్న కుట్రలను సెక్యులర్ భావజాలం కలిగినవారందరూ వ్యతిరేకిస్తున్నారని వివరించారు. రాజకీయాల్లో, ప్రభుత్వంలో, విద్యారంగంలో మత ప్రమేయాన్ని పూర్తిగా తొలగించిన్నప్పుడే సెక్యులర్ దేశం అవతరిస్తుందన్నారు. పేదల పక్షాన అలుపెరగని పోరాటం చేసిన మహనీయుడు మాజీ ఎమ్మెల్యే మస్కు నర్సింహ అని కొనియాడారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి ఉన్న సమయంలో ఎమ్మెల్యేగా కొనసాగిన ఆయన ప్రజాసమస్యలపై అసెంబ్లీలో తన గళం వినిపించారని గుర్తుచేశారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, భూమి పంపిణీ చేయాలని కోరుతూ పలుమార్లు శాసనసభ వెల్‌లోకి దూసుకొచ్చారన్నారు. అనంతరం నర్సింహకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ, జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, మస్కు నర్సింహ సతీమణి అరుణ, పార్టీ నేతలు సామేల్, రామచంద్రయ్య, బుగ్గరాములు, కవిత, యాదయ్య, జగన్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# టెలీమెడిసిన్ సేవలు షురూ..

**సాక్షి, సిటీబ్యూరో:** అమెరికా వైద్యులతో భారతీయులకు నేరుగా సేవలందించే లక్ష్యంగా ‘టెలీ మెడిసిన్ సర్వీస్’ ప్రారంభమైంది. ‘మై అమెరికన్ డాక్టర్, సెకండ్ ఓపీనియన్’ పేరిట వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. రోగులకు అందుతున్న వైద్యం గురించి స్పష్టత ఇచ్చేందుకు, ఇక్కడి చికిత్స సరైనదేనా అనే అనుమానాలను నివృత్తి చేసేందుకు తాము ఈ సేవలను అందుబాటులోకి తెచ్చామని ఎమర్జెన్సీ మెడిసిన్ నిపుణుడు, మై అమెరికన్ డాక్టర్ సీఈవో డా.రాజ్ నార్ల తెలిపారు. భారత్‌లో అందుతున్న సేవలు అత్యున్నతమైనవని, అయితే.. కొందరు విదేశాల్లో చికిత్స పొందేందుకు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. ఇలాంటి వారికోసం ముందుగానే వారి వ్యాధికి సంబంధించి ఎలాంటి సేవలు అవసరపడతాయో నిర్ధారించుకునేందుకు తమ సేవలు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. పైగా అమెరికాలో ఇలాంటి సేవలు అందించే సంస్థల ఫీజు కన్నా తక్కువ ఫీజుతోనే ఎన్నో సేవలు అందుబాటులోకి తెచ్చావన్నారు. కార్యక్రమంలో కో ఫౌండర్ డాక్టర్ దీపక్ థామస్, ఐసీయూ మెడిసిన్ స్పెషలిస్ట్ డాక్టర్ రాజన్ గార్గ్, అడిక్షన్ మెడిసిన్, ఇంటర్నల్ మెడిసిన్ స్పెషలిస్ట్ డాక్టర్ యోగి గుండం రాజ్, డాక్టర్ డేనియల్ ఫ్రెడ్‌మాన్ పాల్గొన్నారు.



# హైకోర్టు ఆదేశం.. కదిలిన అధికారులు

**తుర్కయంజాల్:** కమ్మగూడ మండల ప్రజా పరిషత్ పాఠశాలకు చెందిన భూమి నుంచి రోడ్డు వేసేందుకు గ్రామస్తులు యత్నించగా ఈ వివాదం కోర్టుకు చేరింది. హైకోర్టు ప్రభుత్వానికి మొట్టికాయలు వేయండంతో ఎట్టకేలకు అధికారులు స్పందించారు. శనివారం ఇబ్రహీం పట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి, డీఈఓ సుశీంధర్‌రావు పాఠశాల హద్దులు గుర్తించి కందకం తవ్వించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కమ్మగూడలోని ప్రభు త్వ పాఠశాలకు చెందిన 1,725 గజాల భూమి మ ధ్యలో న్యూ సుభాష్‌నగర్ కాలనీ వాసులు రోడ్డు వేసేందుకు కొన్నేళ్లుగా యత్నిస్తున్నారు. తరగతిగదిని ఆనుకుని మార్గం ఏర్పాటు చేసి వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. దీనికి తోడు రాత్రిళ్లు మద్యం సేవించి సీసాలు అక్కడే వదిలేసి వెళ్తున్నారు. ఈ సమస్యపై ఇటీవల బదిలీపై వెళ్లిన హెచ్‌ఎం భూపతిదాసు కొన్నేళ్ల పాటు పోరాటం చేశారు. అధికారుల చుట్టూ తిరిగారు. కాలనీవాసుల బెదిరింపులను ఎదుర్కొన్నారు. ఇటీవల ఆయన బదిలీపై వెళ్తూ.. పూర్తి వివరాలతో హైకోర్టుకు లేఖ రాసి న్యాయం చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే, జె.అనిల్ కుమార్‌తో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టి రెవెన్యూ, విద్యాశాఖ, కలెక్టర్, ఎంపీడీఓ, మున్సిపాలిటీకి నోటీసులు జారీచేశారు. స్పందించిన అధికార యంత్రాంగం తాజాగా చర్యలను ప్రారంభించింది. త్వరలోనే ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని అధికారులు వెల్లడించారు. దీంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# బోనాల్లో డ్యాన్స్ వేసేవాణ్ని

**ఆ జ్ఞాపకాలు ఎంతో మధురం । సినీ నటుడు ప్రియదర్శి**

‘నేను పెరిగింది హైదరాబాద్ పాతబస్తీలో. చిన్నప్పటి నుంచి లాల్ దర్వాజా బోనాలు చూస్తూ పెరిగాను. పోతరాజు వేషంలో డ్యాన్స్ చేసేవాళ్లని చూస్తుంటే సంతోషంగా ఉంటుంది. డ్రమ్స్, మ్యూజిక్, డ్యాన్స్ చూస్తుంటే బాడీలో ఒక వైబ్రేషన్ వస్తుంటుంది. ఇప్పుడు సినిమాల్లోకి వచ్చాక డైరెక్టుగా బోనాల్లో పాల్గొనలేకపోతున్నాను గాని.. లాల్ దర్వాజా, సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి, బల్కంపేట ఎల్లమ్మ.. ఇలా అమ్మవార్ల బోనాల ఉత్సవాలను టీవీలో చూస్తుంటాను.. చాలా సంతోషంగా ఉంటుంది’ అని సినీ నటుడు ప్రియదర్శి అన్నారు. సహాయ, కామెడీ పాత్రలతో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న ప్రియదర్శి.. నగరంలో బోనాల పండగ జోరుగా జరుగుతున్న సందర్భంగా ‘సాక్షి’తో తన అనుభవాలను ఇలా పంచుకున్నారు.

‘నాకు ఊహ తెలిసినప్పటి నుంచి నేను గమనిస్తున్నది ఏంటంటే.. బోనాల తర్వాత మనకు తప్పకుండా వర్షం వస్తుంది. ఈ విషయాన్ని నేను ఏళ్ల తరబడి చూస్తున్నాను. బోనాల సమయంలో తప్పనిసరిగా వర్షం రావడం మంచిగా అనిపిస్తుంది. హైదరాబాద్‌లో అన్ని కులాలు, మతాల వారు బోనాల ఉత్సవాలను ఎంతో సంబరంగా జరుపుకోవడం సంతోషంగా ఉంటుంది. నేను చిన్నప్పుడు బోనాల్లో డ్యాన్స్ చేసేవాణ్ని. పోతరాజు వేషధారణల మధ్య డ్యాన్స్ చేయడమంటే నాకు చాలా ఇష్టం. అలాగే హైదరాబాద్‌లో యాదవ సోదరులు సదర్ ఉత్సవాలని ఎంతో ఘనంగా నిర్వహిస్తుంటారు. అవి కూడా నాకెంతో ఇష్టం.. నేను పాల్గొనేవాణ్ని. ‘సేవ్ ద టైగర్స్’ వెబ్ సిరీస్‌లో నేను ఘంటా రవి పాత్ర చేస్తున్నప్పుడు ఇలాంటివన్నీ బాగా రిఫరెన్స్‌గా వాడుకున్నా. సెలబ్రిటీ అయ్యాక బోనాలు, సదర్ ఉత్సవాల్లో డైరెక్టుగా పాల్గొనలేకపోతున్నాను. తప్పదు.. కొన్నింటిని త్యాగం చేయాల్సిందే. సంక్రాంతి పండగను ఆంధ్రప్రదేశ్‌లో ఎంత ఘనంగా జరుపుకుంటారో హైదరాబాద్‌లోనూ అంతే గ్రాండ్‌గా జరుపుకొంటారు. తెలంగాణలో సమ్మక్క- సారక్క, కొండగట్టు అంజన్న, యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి, మల్లన్న జాతర.. ఇలాంటివన్నీ సంస్కృతికి నిదర్శనం’. హిందువుల పండగలనే కాదు... నాకు అన్ని పండగలూ ఇష్టమే. ప్రత్యేకించి రంజాన్, బక్రీద్ సమయంలో ముస్లిం స్నేహితులని కలవడం.. వారు పెట్టే ఖీర్ (పాయసం) తినడం చాలా హ్యాపీగా ఉంటుంది’ అన్నారు ప్రియదర్శి.

– సాక్షి, సినిమా డెస్క్

## క్లుప్తంగా

### నిందితుడికి రిమాండ్

శేశంపేట: ఆలయంలో చోరీకి పాల్పడిన వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని శ్రీవీర బ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో ఈ నెల 10న ఓ వ్యక్తి హుండీని పగలగొట్టి నగదును అపహరించాడు. పూజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితుడు మండల పరిధి మంగళిగూడ గ్రామానికి చెందిన పెరుమాళ్ల నర్సింహగా గుర్తించి శనివారం అరెస్టు చేశారు. అనంతరం అతన్ని రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

### అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ఇబ్రహీంపట్నం రూరల్: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్‌ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన రవీంద్రకుమార్ రెండు నెలలుగా స్థానికంగా ఉన్న టీసీఎస్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ.. ఠాణా ఎదుట ఉన్న ఓ అపార్ట్‌మెంటులో నివాసం ఉండేవాడు. ఈ నెల 25న మధ్యాహ్నం భోజనం చేసి తన గదిలోకి వెళ్లాడు. సాయంత్రం డ్యూటీకి రాకపోవడంతో తన మేనేజర్ పోన్ చేసినా రవీంద్ర తీయలేదు. దీంతో గదికి వచ్చి చూడగా.. రవీంద్ర(22) కిటికీకి ఉరి వేసుకొని అత్మహత్యకు పాల్పడ్డాడు. శరీరంపై ఎలాంటి దుస్తులు లేవు. డ్రాయర్ మాత్రమే ధరించి ఉన్నాడు. కాళ్లు కిందకు వేలాడటం, కిటికీకి ఉరి వేసుకోవడం, శరీరంపై గాయాలు ఉండటంతో ఆయన మృతిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### ట్రాఫిక్ సీఐ, సిబ్బందిపై ఫిర్యాదు

చేవెళ్ల: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడి పోలీసుల చేతిలో దెబ్బలు తిన్న వ్యక్తి చేవెళ్ల ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఇటీవల మండల పరిధిలో ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా.. పలువురు యువకులు పట్టుబడ్డారు. ఈ విషయంలో ఆ యువకులను పోలీసులు తిడుతూ కొట్టిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో బాధితుల్లో ఒకడైన ముడిమ్యాల గ్రామానికి చెందిన బి.మహేశ్.. ట్రాఫిక్ పోలీసుల తీరుతో అవమానం జరిగిందని, దీనికి కారణమైన సీఐ, కానిస్టేబుల్, హోంగార్డులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపారు.

# సాంకేతిక పరిజ్ఞానంతో మెరుగైన సేవలు

**జిల్లా రెవెన్యూ అధికారి సంగీత**

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రతి శాఖలో ఈ–ఆఫీసు ద్వారా ప్రజలకు సేవలందించాలని, అప్పుడే వారికి పారదర్శకమైన సేవలు అందుతాయని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆమె ఈ–ఆఫీసు నిర్వహణపై జిల్లా అధికారులకు, సిబ్బందికి యస్‌ఐసీ సెంటర్ ద్వారా వర్చువల్‌గా శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ శిక్షణ ద్వారా అవసరమైన కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అధికారులందరూ పెంపొందించుకోవాలని, రానున్న రోజుల్లో సాంకేతిక పరిజ్ఞానంతోనే విధులు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. అందుకే ప్రతి శాఖలో ఈ–ఆఫీసు విధానం ద్వారా కార్యకలాపాలు నిర్వహించాలని ఇప్పటికే కలెక్టర్ శశాంక స్పష్టంచేసినట్లు ఆమె పేర్కొన్నారు. శాఖల వారీగా లాగిన్స్ పెండింగ్‌లో లేకుండా త్వరగతిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే కొన్ని శాఖలకు సంబంధించిన బల్క్ ఈ–మెయిల్ ఐడీలను క్రియెట్ చేసుకోవడానికి అధికారులు చర్యలు చేపట్టారన్నారు. ఐడీలు క్రియెట్‌కాని ఎడలా త్వరితగతిన ఏర్పాటు చేసుకొని, కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానంతో అధికారులందరూ శిక్షణ తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఐసీ అధికారి స్వర్ణలత, జిల్లా అధికారులు, ట్రైనింగ్‌కు హాజరైన సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో ఈ-ఆఫీసు నిర్వహణపై శిక్షణలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ సంగీత

# ఏకీకృత సర్వీసు రూల్స్‌ను సాధిస్తాం




సభ్యత్వ నమోదును నిర్వహిస్తున్న సంఘం సభ్యులు

**పీఆర్‌టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి**

మొయినాబాద్ రూరల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పీఆర్‌టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సామల మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధి హిమాయత్‌నగర్, చిన్నమంగళారం గ్రామాల్లో ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలల్లో సంఘం సభ్యత్వ నమోదును మండల బాధ్యుడు బందయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సామల మాట్లాడారు. త్వరలో ఏకీకృత సర్వీసు రూల్స్‌ను సాధిస్తామని, ఉపాధ్యాయులకు ఎంఈఓ, జేఎల్‌డెట్ లెక్చరర్‌గా ప్రమోషన్లు ఇప్పిస్తామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను 50 శాతం ఫిట్‌మెంట్‌ను ఇప్పిస్తామని చెప్పారు. జీఓ 11,12ను సవరించి ఎస్జీటీ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇప్పించేందుకు కృషి చేస్తామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు రాములు, చేవెళ్ల మండల శాఖ కార్యదర్శి వినోద్, నరేందర్‌రెడ్డి, విజయ్ కుమార్, వేణుగోపాల్, నరేందర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

### ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

అబ్దుల్లాపూర్‌మెట్: ఇంట్లో ఎవరూ లేని సమయంలో గృహిణి చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా చిట్యాలకు చెందిన శివ, స్వప్న దంపతులు కొంతకాలంగా స్థానికంగా నివాసముంటున్నారు. శివ పని నిమిత్తం శనివారం ఉదయం బయటకు వెళ్లగా.. ఇంట్లో ఉన్న స్వప్న(29) బలవన్మరణానికి పాల్పడింది. సాయంత్రం 4గంటలకు మృతురాలు భర్త ఇంటికి రాగా.. ఎంతకీ తలుపులు తీయకపోవడంతో పగలగొట్టి చూడగా స్వప్న ఉరికి వేలాడుతూ కనిపించింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా.. ఆమె అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఇదిలా ఉండగా.. భార్యభర్తలిద్దరికీ.. వేర్వేరుగా వివాహాలు జరిగాయని, వారినుంచి విడిపోయి వీరిద్దరూ సహజీవనం చేస్తున్నారని, వీరికి 5 నెలల పాప ఉన్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలినట్లు సమాచారం. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. దర్యాప్తు చేస్తున్నారు.

### స్పాట్ అడ్మిషన్లకు ఈ నెల 30 ఆఖరు

శంషాబాద్ రూరల్: మండలంలోని పాల్మాకుల మోడల్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరానికి స్పాట్ అడ్మిషన్లకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ విష్ణుప్రియ తెలిపారు. ఈ నెల 30 లోపు అందుబాటులో ఉన్న సీట్లను భర్తీ చేస్తామన్నారు. డే స్కాలర్స్ కోసం మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అంతేకాకుండా మోడల్ స్కూల్‌లో హవర్లీ బేస్‌పై పీజీటీ, కెమెస్ట్రీ లెక్చరర్ పోస్టుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

# ఎన్‌సీసీ క్యాడెట్లకు బంగారు భవిష్యత్తు

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు ఎన్‌సీసీ విభాగంలో పోటీతత్వం ప్రదర్శించడం అభినందనీయమని ఇండియన్ ఇన్‌ఫర్మేషన్ సర్వీస్ అధికారి, ఎన్‌సీసీ, ఏఎన్‌ఓ కెప్టెన్ డాక్టర్ జీ.విజయ్ అన్నారు. మండల పరిధి హిమాయత్‌నగర్ చైతన్య డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో కార్గిల్ విజయ్ దివాస్ కార్యక్రమాన్ని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, ఇన్‌ఫర్మేషన్ అండ్ బ్రాండ్ కాస్టింగ్ మంత్రిత్వ శాఖ, ప్రభుత్వ సహకారంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో వ్యవస్థాపకుడు ఛాన్సలర్ పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు కార్గిల్ విజయ్ దివాస్‌కు సంబంధించి పలు పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న డాక్టర్ విజయ్

ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ.. ఎన్‌సీసీలో పాల్గొంటున్న విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపకులపతి, డాక్టర్ దామోదర్, శ్రీధర్ పాల్గొన్నారు.

# సీఎం పర్యటన జయప్రదం చేయండి

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- సభ ఏర్పాట్ల పరిశీలన



సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు/కడ్తాల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. కల్వకుర్తి పట్టణంలో సీఎం సభ ఏర్పాట్లు, కొట్ర గేటు వద్ద ఆవిష్కరించనున్న దివంగత నేత, కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం కసిరెడ్డి మాట్లాడారు. ఆదివారం సీఎం రేవంత్ కల్వకుర్తిలో పర్యటించనున్నారని, ఇందులో భాగంగా జైపాల్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారని పేర్కొన్నారు. అనంతరం కల్వకుర్తిలో నిర్వహించే సంస్మరణసభలో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధి గురించి సీఎం దృష్టికి తీసుకెళ్తామని వెల్లడించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, గుర్రం కేశవులు, వస్పుల జంగయ్య, గూడురి శ్రీనివాస్‌రెడ్డి, యాట నర్సింహ, జగన్, వస్పుల మానయ్య, బాబా, విజయ్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

# పరిశోధనలను ప్రోత్సహించడమే ధ్యేయం




డాటా పత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

మొయినాబాద్‌రూరల్: ఎలక్ట్రానిక్స్ కంప్యూటరింగ్ కమ్యూనికేషన్లలో 5జీ డెవలప్‌మెంట్‌పై అంతర్జాతీయ సదస్సును నిర్వహించామని కేఎల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పార్థసారథి వర్మ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోని అత్యుత్తమ నిపుణులను ఒకే చోట చేర్చడం, సాంకేతిక భవిష్యత్తును రూపొందించే స్థిరమైన అభివృద్ధికి దోహదపడే పరిశోధనను ప్రోత్సహించాలన్నదే యూనివర్సిటీ ఉద్దేశమని తెలిపారు. రెండు రోజుల పాటు పలు దేశాలకు సంబంధించిన 176 పత్రాలను సదస్సులో ప్రదర్శించామని పేర్కొన్నారు. ఇందులో 42 అర్హత కలిగిన పత్రాలను ఆమోదించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో విదేశీ ప్రముఖులతో పాటు అజీజ్‌నగర్ క్యాంపస్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, డాక్టర్ గౌతమ్ పాల్గొన్నారు.

### విజయానికి ఐదు సూత్రాలు

**బాలమేధావి ఆకాష్ కోటి**



ఆకాష్‌ను సన్మానిస్తున్న సుక్‌వల్లభ్ దాస్

మొయినాబాద్‌రూరల్: విజయానికి ఐదు సూత్రాలు ఉన్నాయని, వాటిని అనుసరిస్తే.. అపజయం మనదరి చేరదని స్పెల్‌బి అంతర్జాతీయ ఛాంపియన్ ఆకాష్ కోటి అన్నారు. శనివారం మండల పరిధి స్వామి నారాయణ గురుకుల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యాపక బృందం బాల మేధావిని సన్మానించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా వెంకటగిరికి చెందిన ఆకాష్.. చిన్నతనంలోనే ఆంగ్ల పదాల ఉచ్చారణలో ప్రావీణ్యం పొందారు. అప్పుడే పదాల ఉచ్చారణ పోటీల్లో పాల్గొని పేరు ప్రఖ్యాతులు పొందాడు. ఈ సందర్భంగా గురుకుల్ స్వామీజి పూజ్య సుక్‌వల్లభ్ దాస్ మాట్లాడారు. నేషనల్ స్పెల్లింగ్ లీగ్ చరిత్రలో మొదటి తరగతి విద్యార్థిగా ఆకాశ్ పోటీ పడ్డారని తెలిపారు. 2018 నుంచి 23 వరకు ఆరు సార్లు ఈ పోటీల్లో పాల్గొన్న ఏకైక వ్యక్తి కోటీ అని కొనియాడారు. అనంతరం బాల మేధావి ఆకాష్ మాట్లాడుతూ.. విజయానికి ఐదు ముఖ్య సూత్రాలు ఉన్నాయని పునరుద్ఘాటించారు. కష్టపడి పని చేయడం పట్టుదల, శ్రద్ధ, క్రమ శిక్షణ, అంకిత భావంతో పనిచేస్తే.. విజయం మనదేనని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సతీష్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు ఆకాష్, కృష్ణ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# సూపర్ మార్ట్ తనిఖీ



షాంపుల్ సేకరిస్తున్న సేఫ్టీ అధికారి

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని నేషనల్ మార్ట్ సూపర్ మార్కెట్‌ను శనివారం ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారి ఉదయ్‌కిరణ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మార్ట్‌లోని సామగ్రి నాణ్యత, ఎక్స్‌పైరీ డేట్‌ను పరిశీలించారు. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి మార్ట్‌లో కొనుగోలు చేసిన ఎలిఫెంట్ డేట్స్‌లో పురుగులు రావడంతో ఫుడ్ సేఫ్టీ అధికారులను సంప్రదించాడు. దీంతో అధికారులు తనిఖీ చేశారు. అనంతరం ఉదయ్‌కిరణ్ మాట్లాడుతూ.. ఫిర్యాదు అందడంతో మార్ట్‌ను తనిఖీ చేశామని తెలిపారు. ఎలిఫెంట్ డేట్స్ ప్యాకెట్లను సేకరించి స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీకి పంపామని చెప్పారు. పరీక్షించిన అనంతరం నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. నిబంధనలను పాటించకుండా కాలం చెల్లిన సరకులను నిల్వ చేసినా, విక్రయించినా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.